సాక్షి కర్నూలు

శనివారం : 14 : అక్టోబర్ : 2023



శాస్త్రోక్తంగా ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి అర్చకులు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఊయల సేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మ వార్లను ఉంచి షోడశోపచార పూజలు చేశారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: శుక్రవారం శ్రీశైలంలో సికింద్రాబాద్‌కు చెందిన తెలంగాణ జాగృతి ఫౌండేషన్ కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది.



డ్రైవర్లే దోపిడీ సూత్రధారులు

విలువైన సెల్‌ఫోన్లను అపహరించిన కేసులో కంటైనర్ డ్రైవర్లే సూత్రధారులుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరిని శుక్రవారం డోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి చూపకపోతే చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(సెంట్రల్): గృహ నిర్మాణాల్లో పురోగతి చూపకపోతే కఠిన చర్యలు తప్పవని మండలాధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన హెచ్చరించారు. శుక్రవారం ఉదయం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. హౌసింగ్‌లో కర్నూలు, నందవరం, కోడుమూరు, సి బెళగల్, గూడూరు అర్బన్, హాలహర్వి మండలాల్లో పురోగతి లేదని ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లోని సిబ్బందిని ఇతర ప్రాంతాలకు పంపాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియల తరువాత ఎల్‌పీల జనరేషన్ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు. జేసీ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు హరిప్రసాదు, మోహన్‌దాసు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా సెలవులు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలకు శనివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు డీఈఓ డా.వి. రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న స్కూల్స్ పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సెలవుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని తెలిపారు.

జిల్లాకు వచ్చిన కేంద్ర ప్రతినిధి

- నేడు పట్టు చీరల తయారీ పరిశీలన



కలెక్టర్‌ను కలసిన హరిప్రీత్‌సింగ్

కర్నూలు(అగ్రికల్చర్)/(సెంట్రల్): ఒక జిల్లా, ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) కింద చేనేత పట్టుచీరల (హ్యాండ్‌లూమ్ సిల్క్‌శారీస్) తయారీ ప్రక్రియను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున ఇన్వెస్ట్ ఇండియా(ఎన్‌జీవో) ప్రతినిధి హరిప్రీత్‌సింగ్‌ను జిల్లాకు వచ్చారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ జి.సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఆయన కోడుమూరు, ఎమ్మిగనూరు మండలాల్లో చేనేత పట్టుచీరల తయారీని పరిశీలిస్తారు. చేనేతకార్మికులతో ముఖాముఖిగా మాట్లాడుతారు. ఈయన వెంట జిల్లా చేనేత జౌళిశాఖ అధికారులు ఉంటారు. ఈయన నివేదిక ఇచ్చిన తర్వాత చేనేత పట్టుచీరలకు జాతీయ స్థాయి అవార్డు లభించడంపై స్పష్టత వస్తుంది.

కారుణ్య నియామకాలకు 17న కౌన్సెలింగ్

కర్నూలు(రాజ్‌విహార్): కారుణ్య నియామకాల కింద ఆర్టీసీలో ఉద్యోగాలు ఇచ్చేందుకు ఈ నెల 17న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి (ఆర్టీసీ ఆర్‌ఎం) టి. వెంకటరామం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ శాఖలో పనిచేస్తూ 2020 జనవరి 1 నుంచి చనిపోయిన (ఇన్ సర్వీస్) ఉద్యోగుల జీవిత భాగస్వామి లేదా పిల్లలకు ఉద్యోగం ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలతో మంగళవారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.



కొనుగోలు చేసిన గొర్రెలతో నెహ్రూనగర్ వాసి లక్ష్మీదేవి - సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

పేదరికం తగ్గింది.. పల్లె నవ్వింది!!

సంక్షేమ పథకాలతో అభివృద్ధి పథం

- క్రమంగా తగ్గుతున్న పేదరికం
- నీతి ఆయోగ్ గణాంకాలతో సుస్పష్టం
- టీడీపీ పాలనలో సగటున 11.77శాతం పేదరికం
- ప్రస్తుతం 6.06 శాతానికి తగ్గిన వైనం
- ప్రభుత్వ నిధులతో మెరుగైన స్వయం ఉపాధి

ఈ ఫొటోలో కృష్ణానది సమీపంలో గొర్రెల మందతో నిల్చున్న ఈమె పేరు లక్ష్మీదేవి. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం నెహ్రూనగర్ వాసి. ఈమె వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.33వేలు, స్త్రీనిధి నుంచి రూ. లక్ష, గొర్రెల కోసం రూ. లక్ష తీసుకున్నారు. ఇది కాకుండా అదనంగా బ్యాంకు నుంచి మరో రూ. లక్ష రుణం తీసుకున్నారు. నాలుగు నెలల కిందట 80 గొర్రెలు కొనుగోలు చేశారు. తన భర్తతో పాటు ఇద్దరు పిల్లలు కూడా సహకరిస్తున్నారు. వీటిని మేపుకుంటూ గొర్రె పిల్లలను విక్రయిస్తూ ఆర్థికంగా ఒక్కో మెట్టు ఎదుగుతూ సంతోషంగా జీవిస్తున్నారు.



పిండిమిషన్ నడుపుతోన్న ఈమె పేరు సునీత. ముచ్చుమర్రి వాసి. పదేళ్ల కిందట భర్త రవిభూషణ్ గుండెపోటుతో మరణించారు. కుట్టుమిషన్‌తో తన ఇద్దరు పిల్లలు సుమంత్, శ్యాంను చదివించుకునేది. పిల్లలు పెద్దయ్యారు. జీవనోపాధి ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో శ్యాంకు అమ్మ ఒడిద్వారా నాలుగేళ్లు రూ.55వేలు, పెద్దకుమారుడు సుమంత్‌కు వసతిదీవెన రూ.36వేలు వచ్చింది. సునీతకు మూడేళ్లుగా వైఎస్సార్ చేయూత రూ.56,250, ఆసరా రూ.33వేలు వచ్చింది. పొదుపు సంఘం నుంచి సున్నావడ్డీకి రూ.2లక్షలు తీసుకుంది. అలాగే పీఎంఎఫ్ఈ ద్వారా రూ.2.40లక్షలు తీసుకుంది. ఇందులో 35శాతం సబ్సిడీ వచ్చింది. ఈ డబ్బుతో ఆర్నెల్ల కిందట పిండిమిషన్ ఏర్పాటు చేసుకుంది. ఇప్పుడు రోజూ రూ.1500 సంపాదిస్తూ సంతోషంగా జీవిస్తోంది.

సాక్షి ప్రతినిధి కర్నూలు: ప్రజలకు ఆర్థికదన్ను అందించి, ఉపాధి అవకాశాలతో జీవన ప్రమాణాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ కారణంగానే రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గింది. నీతి ఆయోగ్ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాలను స్పష్టం చేశాయి. విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలపై నీతి ఆయోగ్ సర్వే చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల గణాంకాలను విడుదల చేసింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం రేటు టీడీపీ పాలనతో పోల్చితే బాగా తగ్గింది. 2016–17లో పేదరికం రేటు రాష్ట్రంలో 11.77శాతం ఉంటే, 2022–23లో 6.06శాతానికి తగ్గింది. అంటే ఏకంగా 5.71శాతం తగ్గింది. టీడీపీ హయాంలో కర్నూలు జిల్లాలో పేదరికం ఎక్కువ ఉండి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండేది. 2016–17లో 19.64శాతం పేదరికం ఉండేది. రాష్ట్రంలో ఇదే అత్యధికం. ఇప్పుడు అది 6.8శాతం తగ్గి 12.84శాతానికి చేరింది. ఇప్పుడు రాష్ట్రంలో కర్నూలు జిల్లా ఐదోస్థానంలో ఉంది. కర్నూలుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలతోనే రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గింది.

దేశంలో ఏ రాష్ట్రం చేయని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు

2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత నాలుగు అంశాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. విద్య, వైద్యం, అభివృద్ధి కార్యక్రమాలు, జీవన ప్రమాణాల పెరుగుదల. దీంతోనే రాష్ట్రంలో ప్రజలు ఆర్థికంగా బలపడ్డారు. ఆదాయ వనరులు పెంచుకుంటున్నారు. ఈ నాలుగున్నరేళ్లలో ఇప్పటి వరకూ రూ.2.35లక్షల కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా మహిళల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ సొమ్ము విద్య, ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా ఉపాధి అవకాశాలను కల్పించుకునేందుకు దోహపడింది. ఈ డబ్బులతో పాడిపశువులు, గొర్రెలు, కిరాణాదుకాణాలు, చీరల వ్యాపాం, బొటిక్ సెంటర్లు, పిండిమిషన్లు, హోటళ్లు తదితర ఉపాధి మార్గాలను ఏర్పరుచుకున్నారు. పొదుపు సంఘాల ద్వారా వడ్డీలేని రుణాలు ఇవ్వడంతో అది కూడా వీరి ఎదుగుదలకు తోడ్పడింది. అలాగే విద్యారంగంలో అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, విద్యాకానుక, నాడు–నేడు తదితర పథకాలతో విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం భరోసాగా నిలిచింది.



ఇది ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్‌ప్లాంటు'(ఏకీకృత పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు). ఓర్వకల్లు మండలంలోని పిన్నాపురంలో రూ.15వేల కోట్లతో 'గ్రీన్‌కో' కంపెనీ నిర్మిస్తోంది. ఇప్పటికే 70శాతం పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర చరిత్రలో ఇంత పెట్టుబడితో నిర్మిస్తున్న తొలిప్రాజెక్టు, ప్రపంచంలో తొలి ఇంటిగ్రేటెడ్ పవర్‌ప్లాంటూ ఇదే. ప్లాంటు నిర్మాణంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల ఉద్యోగాలు రానున్నాయి. 75శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలనే చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావడంతో 17,250 ఉద్యోగాలు స్థానికులకే దక్కనున్నాయి.

జీవన ప్రమాణాలు మెరుగు

ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ జీవన ప్రమాణాల మెరుగుపడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. సచివాలయ వ్యవస్థతో భారీగా ఉద్యోగాలు కల్పించింది. ప్రతీ గ్రామానికి సగటున 10–15మందికి ప్రభుత్వ కొలువులు వచ్చాయి. దీంతో వారు జీవితంలో స్థిరపడ్డారు. వీరిని చూసి ఇరుగుపొరుగు తమ పిల్లలను బాగా చదవిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయనే భావన ఏర్పడింది. విద్యార్థుల్లో కూడా మార్పు వచ్చి చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దీంతో పాటు పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధి కార్యక్రమాలతో కూడా ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. దీంతో రాష్ట్రంలో తలసరి ఆదాయం కూడా పెరిగింది. 2018–19లో తలసరి ఆదాయం రూ.1,54,031 ఉంటే, 2022–23లో రూ.2,19,518కి పెరిగింది. 2020–21తో పోల్చితే తలసరి ఆదాయం 17.61శాతం పెరిగితే, 2022–23లో ఇది 18.98శాతం పెరిగింది. జీవనప్రమాణాలు మెరుగుపడ్డాయనేందుకు తలసరి ఆదాయంలోని పెరుగుదలను చూస్తే స్పష్టమవుతోంది. విద్య, వైద్యంతో పాటు వ్యవసాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకుంది. రైతుభరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అధ్యయనం చేసి తమ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసేందుకు వస్తున్నారు. ఇలాంటి చర్యలన్ని కూడా జీవన ప్రమాణాలు మెరుదుపడేందుకు దోహం చేశాయి. ఈ చర్యలతో పల్లె ప్రజలతో పాటు సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనస్థితిగతులు మెరుగుపడి సంతోషంగా జీవిస్తున్నారు.

విద్య, వైద్య ప్రమాణాలు పెంచే దిశగా విప్లవాత్మక మార్పులు

అమ్మ ఒడి, వసతిదీవెన, విద్యాదీవెన, విదేశీ దీవెన పథకాలకు 96,66,696 మంది లబ్ధిదారులకు ఏకంగా రూ.34,719.18కోట్లను ఖాతాల్లోకి జమ చేసింది. ఇవి కాకుండా నాడు–నేడు ద్వారా స్కూళ్లు అభివృద్ధి చేశారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా, కాదు.. కాదు.. అంతకంటే మిన్నగా అభివృద్ధి చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు కూడా భారీగా పెరిగాయి. ఇక్కడ చదివే విద్యార్థులకు విద్యాకానుక ద్వారా సకలం ప్రభుత్వమే అందించి వారి చదువుకు దన్నుగా నిలుస్తోంది. దీంతో రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. అలాగే వైద్యరంగంలో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఆరోగ్యశ్రీ పరిధిలో మరిన్ని జబ్బులను చేర్చడంతో పాటు రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను అదనంగా నిర్మిస్తోంది. ఇప్పటికే 5 మెడికల్ కాలేజీలను ప్రారంభించారు. దీంతో వైద్యసీట్లు పెరగడం, తద్వారా డాక్టర్ల సంఖ్య పెరిగి పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రానుంది. అలాగే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా సెంటర్లు ఆధునీకరించారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి. సృజన

గోనెగండ్ల: స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన మండల స్థాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం గోనెగండ్ల ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా ఎండార్స్‌మెంట్ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎంపీపీ టీ. నసురుద్దీన్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీడీపీ పరిశీలన

గాజులదిన్నె ప్రాజెక్టును జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన పరిశీలించారు. ప్రాజెక్టు సామర్థ్యం పెంపు, భూసేకరణ, ప్రస్తు తం నీటి నిల్వపై ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్రస్ట్ గేట్ల పనులను పరిశీలించారు. ప్రాజెక్టు నీటిని తాగునీటి అవసరాల కోసం ఏప్రిల్, మే వరకు సంరక్షించుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

శ్రీశైలం నుంచి 25,460 క్యూసెక్కుల విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు గురువారం నుంచి శుక్రవారం వరకు 25,460 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 9.124 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం నాగార్జున సాగర్‌కు 18,663 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,312 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,560, మల్యాల ఎత్తిపోతలకు 337, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రానికి జలాశయంలో 78.3915 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 849.20 అడుగులకు చేరుకుంది.

గుండె నిండా అభిమానం



సీఎం చిత్రపటానికి నమస్కరిస్తున్న నాగేశ్వరరావు

- టీడీపీ కార్యకర్తకు సీఎం రిలీఫ్ ఫండ్
- గుండె ఆపరేషన్‌కు రూ.8.20 లక్షలు మంజూరు
- ఎమ్మెల్యే శిల్పా రవి చొరవతో సహాయం అందజేత

'కులం చూడం, మతం చూడం, ప్రాంతం చూడం, వర్గం చూడం, పార్టీ చూడం చివరికి ఎవరికి ఓటు వేసారన్నది కూడా చూడకుండా మంచి చేస్తామని ఎన్నికల వేళ ఏదైతే చెప్పామో.. ఆ చెప్పిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలను తూచా తప్పకుండా అందరికీ అందించాం. నా వాళ్లు, కాని వాళ్లు అని ప్రజలను విభజించే జన్మభూమి కమిటీలను పూర్తిగా రద్దు చేసి, ఎన్నికల వరకే రాజకీయాలు, ఎన్నికలు అయిపోయిన తర్వాత అందరూ నా వాళ్లే అనే గొప్ప సందేశాన్ని ఈ నాలుగేళ్ల కాలంలో ఇవ్వగలిగాం'.

ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పారదర్శక పాలన గురించి ఇలా వివరించారు. సంక్షేమ పథకాలే కాదు పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుంటుందని చెప్పేందుకు నంద్యాలకు చెందిన టీడీపీ కార్యకర్తనే నిదర్శనం.

నంద్యాల(అర్బన్): ఆయనొక కరుడుగట్టిన టీడీపీ వీరాభిమాని. అంతటి అభిమానికి గుండె సంబంధిత వ్యాధి సోకింది. పార్టీ కోసం పాటు పడిన కార్యకర్త మృత్యువుతో పోరాడుతున్న విషయం టీడీపీ ఇన్‌చార్జ్‌లకు తెలిసింది. అయినా సహాయం అందించక పోగా కనీసం పరామర్శకు కూడా రాలేదు. ఆ గుండెకు ఏమి కాకుండా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. ఆర్థిక సహాయం చేసి ప్రాణాన్ని నిలిపారు. నంద్యాల మండలం అయ్యలూరు మెట్టకు చెందిన దాది నాగేశ్వరరావు కొద్ది నెలల క్రితం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నంద్యాల, కర్నూలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నా ఈ వ్యాధి పరిధిలోకి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తండ్రిని కాపాడుకునేందుకు పార్టీలను పక్కనపెట్టిన కుమారులు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బసవేశ్వరరెడ్డి, రవికుమార్ రెడ్డి ద్వారా విషయాన్ని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పార్టీలు ముఖ్యం కాదని, ఓ ప్రాణాన్ని కాపాడటానికి మానవతా దృక్పథంతో ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు మంజూరయ్యేలా ఎమ్మె ల్యే శిల్పా రవి సీఎంఆర్‌ఎఫ్‌కు సిఫారసు చేశారు. ఎమ్మెల్యే లెటర్ తీసుకున్న నాగేశ్వరరావు కుమారులు నాగరాజు, నాగార్జున అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే శిల్పారవితో ఫోన్ చేయించుకోవడంతో రూ.8.50 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ త్వరితగతిన విడుదల అయ్యింది. సీఎం రిలీఫ్ ఫండ్‌తో నాగేశ్వరరావుకు ఆగస్టు నెలలో హైదరాబాద్ నిమ్స్‌లో ఆపరేషన్ చేయించారు. క్షేమంగా ఇంటికి చేరుకున్న ఇంటి పెద్దను చూసి కుటుంబీకులు సంతోషించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాగేశ్వరరావు బతికేందుకు సాయం అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డిని జీవితాంతం గుర్తు పెట్టుకుంటామని అతని భార్య లక్ష్మీదేవి, కుమారులు నాగరాజు, నాగార్జున చెబుతున్నారు. నాగేశ్వరరావు మృత్యుంజయుడిగా తిరిగి వచ్చినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎవరూ పరామర్శించడానికి రాలేదన్నారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి ఇంటికి వచ్చి భరోసా కల్పించారన్నారు. ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని చెప్పడంతో ఎంతో ధైర్యం వచ్చిందన్నారు. ప్రస్తుతం తమ కుటుంబానికి జగనన్నే దేవుడు అని వారు చెబుతున్నారు.

భారీగా విద్యుత్ వాడకం

- వాతావరణ మార్పులతో వేసవిని తలపిస్తున్న అక్టోబరు

కర్నూలు(రాజ్‌విహార్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యుత్ వాడకం బాగా పెరిగింది. వాతావరణ మార్పులతో భానుడు సెగ పెంచాడు. వర్షాలు, చలితో చల్లగా ఉండాల్సిన అక్టోబరు సెగలు కక్కుతోంది. ఉష్ణోగ్రతలు పెరగడంతో వేసవిని తలపిస్తోంది. దీంతో గత ఏడాది అక్టోబరుతో పోల్చితే విద్యుత్ వాడకం రెట్టింపు అయ్యింది. సాధారణంగా ప్రతి ఏటా ముందస్తుగా 12 నెలల విద్యుత్ వాడకం, ఉత్పత్తి, కొనుగోళ్లు, అవసరాలను అంచనా వేస్తారు. జనవరిలోనే విద్యుత్ పంపిణీ సంస్థలు ఏ నెలలో ఏ మేరకు వాడకం ఉంటుంది, అవసరాలతో కూడిన పూర్తి వివరాలను ఏపీ ఈఆర్‌సీకి పంపుతారు. వీటిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, మార్చి మొదటి వారంలోపు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తారు. పూర్తి నివేదికలను ప్రభుత్వానికి పంపితే.. అందుకు తగ్గట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుంది. ఇందులో భాగంగానే ఏ నెలకు ఆ నెల కోటా కేటాయిస్తారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అన్ని కేటగిరీల్లో 16.54 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి 2023 అక్టోబరులో ప్రతి రోజు 13.790 మిలియన్ యూనిట్లను కోటాగా ఖరారు చేశారు. అయితే కోటాకు మించి 18 నుంచి 20 మిలియన్ యూనిట్లు వాడుతున్నారు. వేసవి తలపిస్తున్న ఉష్ణోగ్రతలతో ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీ, ఫ్యాన్లు లేనిదే కూర్చోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది వ్యవసాయానికి 18 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంతో వాడకమూ పెరిగింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రోజు వారి కోటా కంటే 50లక్షల (5 మిలియన్ యూనిట్లు) వరకు అదనంగా విద్యుత్ వాడుతున్నారు. ఈ నెల 9వ తేదీని అత్యధికంగా 65 లక్షల యూనిట్లు వినియోగించగా గత 12 రోజుల్లో ఇదే అధిక వాడకంగా లెక్కలు చెబుతున్నాయి. అనుకోకుండా ఎదురైన పరిస్థితుల కారణంగా వినియోగం పెరిగినా అందుకు తగ్గట్లు విద్యుత్ ఉత్పత్తి, సరఫరా లేకపోవడంతో అక్కడక్కడ సమస్యలకు దారితీస్తోంది. అత్యవసర పరిస్థితులను నుంచి గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వ రూ.16 వరకు యూనిట్‌ను కొనుగోలు చేసేందుకు యత్నిస్తున్నా గ్రిడ్ స్లాట్ లభించని పరిస్థితి ఏర్పడుతోంది.

ఎస్‌ఐ మెయిన్స్ పరీక్షకు పటిష్ట బందోబస్తు

కర్నూలు: రాయలసీమ జోన్ పరిధిలో ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షలు ఈ నెల 14, 15 తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్నట్లు, పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. బందోబస్తు విధుల నిమిత్తం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ కృష్ణకాంత్ శుక్రవారం పలు సూచనలు ఇచ్చారు. పరీక్ష కేంద్రాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధివిధానాల గురించి తెలియజేశారు. స్ట్రాంగ్ రూమ్‌లు, పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీగా విధులు నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించే సమయంలో అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. నిర్ణీత సమయానికి గంట ముందు నుంచే హాలులోకి అనుమతించాలన్నారు. హాల్ టిక్కెట్‌తో పాటు బాల్ పెన్ను, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆధార్ లేదా పాన్ కార్డు, లేదా డ్రైవింగ్ లైసెన్సు ఉండేవిధంగా చూడాలన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, ఇతర వస్తువులను అనుమతించవద్దని సూచించారు. కర్నూలులో ఏర్పాటు చేసిన 14 కేంద్రాల్లో 7,644 మంది పురుష అభ్యర్థులు, 877 మంది మహిళా అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 2:30 నుంచి 5:30 గంటల వరకు రెండు రోజుల పాటు పరీక్షలు ముగిసేవరకు సిబ్బంది అందరూ పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. బందోబస్తు విధుల్లో అడిషనల్ ఎస్పీ, 15 మంది డీఎస్పీలు, 26 మంది సీఐలు, 40 మంది ఎస్‌ఐలు, 35 మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 109 మంది కానిస్టేబుళ్లు, 49 మంది ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, హోంగార్డులు, 60 మంది ఫింగర్ ప్రింట్స్ సిబ్బంది కలిపి మొత్తం 343 మందిని నియమించినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

క్లుప్తంగా

'ఉర్దూ'లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు (న్యూసిటీ): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సుల్లో మొదటి ఏడాదిలో మిగిలిన సీట్లలో చేరేందుకు ఓఏఎండీసీ పోర్టల్ ద్వారా స్పాట్ అడ్మిషన్ల కింద దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు తెలిపారు. యూనివర్సిటీలో బీఏ ఎకనామిక్స్ హానర్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్ హానర్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్, బీబీఏ బిజినెస్ అనాలిటిక్స్ హానర్స్ కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు https://oamdc &apsche.aptonline/ OAMDC 202324/ index లింక్‌లో ప్రవేశాలకు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. అలాగే రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి వర్సిటీలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

కర్నూలు డీసీసీ అధ్యక్షులుగా కె.బాబురావు

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడిగా లక్ష్మీనరసింహ యాదవ్ కొనసాగింపు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) నూతన అధ్యక్షులుగా కె.బాబురావు నియమితులయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షునిగా ఉన్న సుధాకర్ బాబును పక్కన పెట్టారు. ఆయన స్థానంలో మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కె.బాబురావును నియమించారు. కాగా నంద్యాల డీసీసీ అధ్యక్షునిగా జె.లక్ష్మీనరసింహ యాదవ్‌ను కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.


జీవాలను మేతకు తీసుకెళ్తూ..


పొలంలో పత్తి తీస్తున్న కూలీలు


ఎద్దుల బండిపై పొలానికి వెళ్తూ..


మిరప పొలంలో అంతర సేద్యం

జీవన సౌందర్యం

ఎద్దుల రంకెలు.. జీవాల అరుపులు.. గుంటక పొస్తూ రైతులు..పచ్చని పొలంలో పాటలు పాడుతూ కలుపు తీస్తున్న కూలీలు.. పల్లెలు జీవన సౌందర్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ప్రకృతికి, మనిషికి మధ్య ఉండే అద్భుత సంబంధాన్ని చూపుతున్నాయి. కర్నూలు నుంచి సుంకేసుల జలాశయానికి వెళ్లే మార్గంలో మునగాలపాడు, శింగవరం, ఆర్. కొంతలపాడు, సుంకేసుల గ్రామాల్లో శనివారం ఈ రమణీయ దృశ్యాలు కనిపించాయి. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు


తనతోపాటు గేదెను మేతకు తీసుకెళ్తున్న మహిళ


పురుగు మందు పిచికారీ చేస్తూ..


సద్ది చెట్టుకు వేలాడదీసి.. వరి పొలంలో కలుపు తీస్తూ..


మొక్కజొన్న విత్తుతూ..


మోటారు సైకిల్‌పై పశుగ్రాసాన్ని తీసుకొస్తూ..

గొర్రెల పెంపకానికి ప్రోత్సాహం

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ గొర్రెలు, మేకలతో పాటు కోళ్లు, పందుల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా సన్నజీవాలతో పాటు కోళ్ల పెంపకానికి రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణ సదుపాయాన్ని కల్పిస్తూ 50 శాతం సబ్సిడీ ఇస్తుండటం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ లైవ్ స్టాక్ మిషన్ సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ కార్యక్రమం 2025–26 వరకు అమలులో ఉంటుంది. రుణాలకోసంఆన్‌లైన్(www.nm.udyamimitra. on)లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఐదు రకాల యూనిట్‌లు

- 100 గొర్రెలు, మేకలు, 5 పొట్టేళ్ల యూనిట్ కాస్ట్ రూ.20 లక్షలు.
- 200 గొర్రెలు, 10 పొట్టేళ్ల యూనిట్ రూ.40 లక్షలు.
- 300 గొర్రెలు, 15 పొట్టేళ్ల యూనిట్ కాస్ట్ రూ.60 లక్షలు.
- 80 గొర్రెలు, 20 పొట్టేళ్ల యూనిట్ కాస్ట్ రూ.80 లక్షలు.
- 500 గొర్రెలు, 25 పొట్టేళ్ల యూనిట్ కాస్ట్ రూ.కోటి.
- కోళ్ల అభివృద్ధి పథకం కింద 100 పెట్టలు, 100 పుంజులు సామర్థ్యం కలిగిన పెరటి కోళ్ల యూనిట్, కోడి పిల్లల ఉత్పత్తి యూనిట్, పొదుగు కోళ్ల యూనిట్ల ఏర్పాటుకు అవకాశం ఉంది. రూ.50 లక్షలు మొదలు కొని అంతకు మించి ప్రాజెక్టు విలువ ఉంటే గరిష్టంగా 25 శాతం రాయితీ లభిస్తుంది. తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ వస్తుంది.
- పందుల పెంపకానికి సంబంధించి 100 అడ పందులు, 10 మగ పందులతో కూడిన యూనిట్ ఏర్పాటు చేసి పిల్లల ఉత్పత్తి, పోషణ చేపట్టవచ్చు.

నేటి వరకు అభ్యంతరాల స్వీకరణ

కర్నూలు సిటీ: సహిత విద్యా వనరుల ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నేటి(శనివారం)సాయంత్రం 5 గంటలలోపు తెలపవచ్చునని సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హుల జాబితా https:// apie. apcfss.in అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. గడువు తరువాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించబోమని తెలిపారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

- నగలు, నగదును బ్యాంకు లాకర్‌లో భద్రపరుచుకోండి
- జిల్లా ప్రజలకు పోలీసు శాఖ విజ్ఞప్తి


ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: ఇంటికి తాళం వేసి ఊరెళ్తున్నారా? అయితే మీ సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారమివ్వండి. దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచుతాం. దసరా పండుగ సెలవుల నేపథ్యంలో సొంత ప్రాంతాలకు వెళ్లేవారు, అపార్ట్‌మెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కృష్ణకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఊళ్లకు వెళ్లేవారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇళ్లకు తాళం వేసి సొంత గ్రామాలకు వెళ్లేవారు విలువైన ఆభరణాలు, నగలు ఇళ్లల్లో ఉంచవద్దని ఎస్పీ పేర్కొన్నారు. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో కాని, లాకర్ సౌకర్యం లేనివారు తెలిసినవారు లేదా బంధువుల ఇళ్లల్లో భద్రపరచుకోవాలని సూచించారు. ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ముందస్తుగా సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. దొంగతనాలు జరగకుండా గస్తీ పోలీసులు ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళ ప్రత్యేక నిఘా ఉంచుతారని పేర్కొన్నారు. సొంత ఊర్లు లేదా ఇతర అవసరాల నిమిత్తం వెళ్లేవారు పోలీసు సలహాలు, సూచనలు పాటిస్తే మంచిదన్నారు. కొందరు తమ బ్యాగుల్లో నగదు, బంగారు ఆభరణాలు ఉంచుకుని ప్రయాణం చేసే సమయంలో దొంగతనం జరిగే అవకాశం ఉంది. కావున తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, గ్యాస్ స్టవ్ రిపేరీ పేరిట అపార్ట్‌మెంట్లలోకి వచ్చే అనుమానితులను అనుమతించకూడదని, కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని పేర్కొన్నారు.

వాహనాలను ఇంటి ఆవరణలో పార్క్ చేసుకోవాలి...

వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేసుకోవాలని, నిర్లక్ష్యంగా ఇంటి బయట పెడితే చోరీలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలకు తాళాలు వేయడంతో పాటు చక్రాలకు కూడా చైన్లతో కూడిన తాళం వేయడం మంచిదని తెలిపారు. పట్టణ వాసులు తమ ఇళ్లకు సీసీ కెమెరాలు అమర్చుకుంటే మంచిదని, వాటిని ఆన్‌లోనే ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. ఊళ్లకు వెళ్లేవారు ఇంటి బయట, లోపల కనీసం రెండు లైట్లు వేసి ఉంటే మంచిదని, ఇంటికి ఇరువైపులా నమ్మకమైన వారు ఉంటే మీరు ఇంట్లో లేని సమయంలో ఆ ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పి వెళ్లమని పేర్కొన్నారు. కాలనీల సంక్షేమ సంఘాలు పండుగ సెలవులు ముగిసేవరకు రాత్రి సమయాల్లో గస్తీని ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు అరికట్టవచ్చన్నారు. ఆభరణాలు మెరుగు పడతామని, తక్కువ రేటుకు బంగారం, వెండి నగలు అమ్ముతామని ఇళ్ల దగ్గరికి వచ్చేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్, మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాలతో పాటు వ్యాపార సముదాయాల్లో 24 గంటలు సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్లు ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా ప్రజలు పోలీసు శాఖ విజ్ఞప్తికి స్పందించి సహకరించాలని, అత్యవసర సమయాలలో డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కేవీఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బదిలీ

కర్నూలు (సిటీ): కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతిని బదిలీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ డిగ్రీ కాలేజీలో పీజీ అడ్మిషన్ల విషయంలో ప్రిన్సిపాల్, ఆ వర్సిటీ అధికారుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంపై ఉన్నత విద్యాశాఖకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పాటు ఆ వర్సిటీకి ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి సేవలు అవసరం లేదని, పరిపాలన సజావుగా సాగేందుకు ఆమె స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్‌కు సరెండర్ చేశారు. సరెండర్ చేసినప్పటికీ పరిపాలనా కారణాలతో ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి బదిలీ చేశారు. కేవీఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బాధ్యతలను సిల్వర్‌జూబ్లీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అప్పగించారు.

ఆకతాయికి జైలుశిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహానందికి చెందిన ఆకతాయికి ఐదు రోజులు జైల్ శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారని పోలీసు సిబ్బంది తెలిపారు. మహానంది దేవ స్థానం ఆవరణంలో మహిళా భక్తుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని రేగటి వెంకటేశ్వరరెడ్డిపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి అతడిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా విచారణ అనంతరం జైలు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జియారత్‌తో ముగిసిన ఎల్లార్తి ఉరుసు


షేక్షావలి తాత సమాధిని దర్శించుకుంటున్న భక్తులు,


నృత్యాలు చేస్తున్న ఫకీరులు

హొళగుంద: ఎల్లార్తిలో షేక్షావలి, షాషావలి తాతల ఉరుసు శుక్రవారం జియారత్ కార్యక్రమంతో ముగిసింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దర్గాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూర్వ ముతవల్లి నూర్‌బాబా ఖాద్రి గంధం మోసుకుని దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అలాగే భక్తులకు ధర్మ సందేశాన్ని ఇచ్చి ఆశీర్వదించారు. ఈ సమయంలో దర్గాలో ఉంటున్న ఫకీరులు ఆటపాటలతో నృత్యాలు చేసి భక్తులను అలరించారు. ఏపీ వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో జరిగిన ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పకడ్బందీగా ఈవీఎంల తనిఖీ

- గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల నుంచి ప్రతినిధులు హాజరయ్యేలా చూసుకోవాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశం

కర్నూలు(సెంట్రల్): అక్టోబర్ 16 నుంచి ప్రారంభమయ్యే ఈవీఎంల ఫస్టు లెవల్ చెకింగ్ (ఎఫ్‌ఎల్‌సీ)కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎఫ్‌ఎల్‌సీ నిర్వహణపై కలెక్టర్లు, ఇతర ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు రిజిస్టర్, లాగ్‌బుక్‌లలో నమోదు చేయాలన్నారు. రిజిస్టర్లను ప్రతి రోజూ కలెక్టర్లకు చూపించే బాధ్యత కంట్రోల్ రూమ్‌లలో పని చేసే సూపర్ వైజర్లపై ఉంటుందన్నారు. ఈ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి ఐడీ కార్డులను జారీ చేయడంతోపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. అనుమతి లేనివారు కేంద్రంలోని సెల్ ఫోన్, కెమెరాలు తీసుకొని రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో గుర్తింపు కలిగిన 8 రాజకీయ పార్టీల్లో ఒక్కో పార్టీ నుంచి కనీసం ఒకరు చొప్పున ప్రతినిధులు ఎఫ్‌ఎల్‌సీకి కోసం హాజరయ్యేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సృజన మాట్లాడుతూ.. కమిషన్ ఆదేశానుసారం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని డీఆర్వో కె.మధుసూదనరావును ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటిస్తూ ఈవీఎంల ఫస్టు లెవల్ చెకింగ్ ప్రక్రియకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


శిరీష (ఫైల్)

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన వివాహిత మంగళి శిరీష ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ శివశంకర్ నాయక్ వివరాల మేరకు .. పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన మహేష్ బాబుతో అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన శిరీషతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. కొంత కాలంగా భర్తతో పాటు అత్తమామలు శ్రీరాములు, లక్ష్మీదేవి అదనపు కట్నం కోసం శిరీషను వేధింపులకు గురి చేశారు. ఈ క్రమంలో వేధింపులు తాళలేక గురువారం రాత్రి ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లెకు తరలించారు. మృతురాలి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శుక్రవారం వెల్లడించారు.

డ్రైవర్లే దోపిడీ సూత్రధారులు

- ఫ్లిప్‌కార్ట్ కంటైనర్ నుంచి 722 సెల్‌ఫోన్లు అపహరణ
- దోపిడీ కేసును ఛేదించిన డోన్ పోలీసులు
- ముగ్గురి నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: లక్షలాది రూపాయల విలువైన సెల్‌ఫోన్లను అపహరించిన కేసులో కంటైనర్ డ్రైవర్లే దోపిడీకి సూత్రధారులుగా పోలీసులు దర్యాప్తులో తేలింది. హర్యానాకు చెందిన ఇద్దరు, నాగపూర్‌కు చెందిన మరో వ్యక్తిని డోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి శుక్రవారం కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. హర్యానా రాష్ట్రం నుహ్ జిల్లా మలాకా గ్రామానికి చెందిన వాజిద్ ఖాన్, షరీఫ్ ఖాన్‌లు ఇన్‌స్టంట్ ట్రాన్స్‌పోర్ట్ సొల్యూషన్స్ కంపెనీలో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరికి మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన సునీల్ బానుదాస్‌తో పరిచయం ఏర్పడింది. ముగ్గురు కలిసి ట్రాన్స్‌పోర్ట్ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించే సరుకు అపహరించేందుకు పథకం పన్నారు. ఈ క్రమంలో గత నెల 9వ తేదీన హర్యానా రాష్ట్రం గురుగావ్ జిల్లా కేంద్రంలోని ఫ్లిప్‌కార్ట్ గోడౌన్ నుంచి విలువైన సామగ్రితో ఇద్దరు డ్రైవర్లు బెంగళూరుకు కంటైనర్‌లో బయలుదేరారు. మార్గమధ్యలో 11వ తేదీ రాత్రి ఆదిలాబాద్ సమీపంలో జాతీయ రహదారిపై ఓడాబా సమీపంలో కంటైనర్‌ను నిలిపారు. ఇంతలో సునీల్ మరో ముగ్గురు స్నేహితుల సహకారంతో అక్కడికి రెండు కార్లలో చేరుకున్నారు. గ్యాస్ కట్టర్ ద్వారా కంటైనర్‌కు ఉన్న డిజిటల్ లాక్‌ను తొలగించి అందులో ఉన్న 722 సెల్ ఫోన్లను కార్లలో వేసుకుని పరారయ్యారు. అయితే డిజిటల్ లాక్‌ను వీడియో కాల్ ద్వారా చూపించాలని కంపెనీ ఉద్యోగులు డ్రైవర్‌కు ఫోన్ చేశారు. దీంతో కంటైనర్‌ను డోన్ జాతీయ రహదారి సమీపంలో ఓబులాపురం మెట్ట వద్ద వదిలేసి ఇద్దరు డ్రైవర్లు పరారయ్యారు. పోలీసులు విచారణ చేసి ట్రాన్స్‌పోర్ట్ కంపెనీకి సమాచారం అందించారు. కంపెనీ మేనేజర్ బల్జిత్ సింగ్ డోన్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కేసును ఛేదించారు.

184 సెల్‌ఫోన్లు రికవరీ

సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు దొంగలు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు పోలీసులు నిఘా ఉంచి నిందితులు ఉంటున్న ఇంటిని గుర్తించారు. కాగా పోలీసుల రాకను పసిగట్టిన దొంగలు రెండు కార్లలో బెంగళూరుకు పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే డోన్ సమీపంలో పోలీసులు వాజిద్ ఖాన్, షరీఫ్‌ఖాన్, సునీల్ బానుదాస్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 184 సెల్‌ఫోన్లు, గంజాయి పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డోన్ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, సీఐలు షాదిక్‌ఆలి, రామకృష్ణ, ఎస్‌ఐలు సుధాకర్‌రెడ్డి, రాకేష్‌లను ఎస్పీ అభినందించారు.